సాక్షి
కుమురం భీం

మంగళవారం : 27 : మే : 2025



పంటమార్పిడితోనే ఫలితం

ఒకే రకమైన పంటల సాగుతో దిగుబడి ఏటా తగ్గుతోంది. పంట మార్పిడితో ప్రయోజనం పొందవచ్చని శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. 8లో▸



వనమహోత్సవానికి సిద్ధం

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. జూన్ 15 నుంచి మొక్కలు పంపిణీ చేయనున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /26.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన యూనియన్ నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల నూతనంగా ఎన్నికైన నాలుగో తరగతి ఉద్యోగుల యూనియన్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాష్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిదాస్, ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



ఫిర్యాదు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి సమస్యలు చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈజ్‌గాం, బోడపల్లి, ఎన్జీవోస్ కాలనీలకు చెందిన అర్జీదారులు భూసమస్యలపై వినతులు అందించారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం



నగదు ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసియా కప్ అత్యాపత్యా పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి గెడం సుహాసినిని జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి శాలువాతో సన్మానించారు. రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ గురుకుల పాఠశాలలో సెకండియర్ చదువుతున్న సుహాసిని ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు కేరళలో జాతీయస్థాయి సీనియర్ ఫెడరేషన్ అత్యాపత్యా పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు వెస్ట్ బెంగాల్‌లో జరిగే ఆసియా కప్ పోటీల్లో పాల్గొననుంది. కార్యక్రమంలో నాయకులు కలాం, రవీందర్, ఖోఖో ఇండియా కోచ్ రాకేష్ పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని మంచిర్యాల జిల్లా భజనా మండలి సంఘం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి వెంకటాచారి కోరారు. జానపద సినీ సకల కళా సాంస్కృతిక జ్ఞానవేదిక అధ్యక్షుడు మురళి దేశ్‌పాండే ఆదేశాల మేరకు జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన కళాకారులు సోమవారం జిల్లా కేంద్రంలో డీపీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కళాకారులకు ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో భజనా కళాకారులతో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, అర్హులకు రూ.10వేల పింఛన్ మంజూరు చేయాలని, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్, సత్తయ్య, నాగన్న, లక్ష్మి, పుష్పక్క తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో అక్రమాలు!



సీసీఐ కొనుగోలు కేంద్రానికి విక్రయానికి వచ్చిన పత్తి వాహనాలు(ఫైల్)

- వ్యాపారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కు!
- రూ.18 కోట్లకుపైగా విలువైన పత్తి అక్రమంగా కొనుగోలు
- విజిలెన్స్ విచారణలో వెలుగుచూసిన బాగోతం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లావ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. విజిలెన్స్ అధికారుల విచారణలో ఈ అక్రమాలు ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న రెండు గ్రామాల రైతుల నుంచి రూ.18 కోట్లకుపైగా విలువైన పత్తి కొనుగోళ్లు చేసినట్లు విజిలెన్స్ అధికారుల అంతర్గతంగా నిర్వహించిన విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట జిల్లాలో పని చేసిన, చేస్తున్న కార్యదర్శులు, ఏఈవోలు, కంప్యూటర్ ఆపరేటర్లను పిలిపించి విచారించారు. అలాగే పలువురు ప్రైవేటు పత్తి వ్యాపారులను సైతం పిలిచి వారి రికార్డులు పరిశీలించినట్లు తెలుస్తోంది.

సీసీఐకి 18,28,900 క్వింటాళ్ల పత్తి..

గత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేసినట్లు అంచనా. పత్తి మద్దతు ధర రూ.7,521గా సీసీఐ నిర్ణయించింది. జిల్లాలో 68,267 మంది రైతులు నేరుగా సీసీఐకి 18,28,900 క్వింటాళ్ల పత్తిని విక్రయించినట్లు సీసీఐ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రైవేటు జిన్నింగ్ మిల్లు వ్యాపారులు 1,33,800 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అయితే ఇక్కడే బడా జిన్నింగ్ వ్యాపారులు సీసీఐ అధికారులతో చేతులు కలిపి అక్రమ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ప్రైవేటులో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన సరుకునే తిరిగి రూ.7,521 ధర చొప్పున సీసీఐకి విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది.

బాగోతం జరిగిందిలా...

జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసినా.. అసలు పంట ఎన్ని ఎకరాల్లో వేశారనేది నిర్ధారణ జరగకపోవడంతో అక్రమాలకు తావిచ్చినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో కచ్చితమైన పంట వివరాలు నమోదు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు దానిని తమ ఆదాయ వనరుగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా 17 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఇందులో జిల్లా కేంద్రంలో ఉన్న ఇద్దరు వ్యాపారులు ఈ అక్రమ కొనుగోళ్ల వ్యవహారంలో చక్రం తిప్పుతున్నారు. ఏటా పత్తి కొనుగోళ్ల సమయంలో సీసీఐ, వ్యవసాయ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు భారీ మొత్తంలో మామూళ్లు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆ ఇద్దరు వ్యాపారులే తాజాగా జరిగిన కొనుగోళ్లలోనూ భారీగా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు తమ జేబులో వేసుకున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ అధికారులు జారీ చేసే పంట నిర్ధారణ పత్రాలు, టీఆర్‌ల ఆధారంగా దోపిడీకి తెరతీసినట్లు సమాచారం. కొందరు రైతుల పేరిట రూ.18 కోట్లకుపైగా విలువచేసే పత్తిని కొనుగోలు చేసి సీసీఐకి విక్రయించినట్లు తెలుస్తోంది.

విచారణ చేపట్టిన విజిలెన్స్..

భారీస్థాయిలో అక్రమ కొనుగోళ్లు జరిగాయన్న ఫిరాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. జిల్లాలో పత్తి కొనుగోళ్ల సమయంలో పనిచేసిన సీసీఐ అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, వ్యవసాయ అధికారులు, ఆపరేటర్లను వారం రోజుల కిందట కరీంనగర్ కార్యాలయానికి పిలిచి విచారించారు. పలు రికార్డులు పరిశీలించి.. వ్యక్తిగతంగా ఒక్కొక్కరి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేయించారు. అదే సమయంలో రూ.18 కోట్లకు పైగా విలువైన పత్తిని అక్రమంగా కొనుగోలు చేసిన ఇద్దరు ప్రైవేటు జిన్నింగ్ వ్యాపారులకు సంబంధించిన రికార్డులను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పక్కాగా అక్రమాలు జరినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వివరాలు తెలుసుకున్నారు

పత్తి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సీసీఐ, కార్యదర్శులు, వ్యవసాయ అధికారులు, ఆపరేటర్ల నుంచి విజిలెన్స్ అధికారులు అడిగి తెలుసుకున్న మాట వాస్తవమే. అయితే కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు నా దృష్టికి రాలేదు. విజిలెన్స్ అధికారుల విచారణలో ఆ వివరాలు వెలుగులోకి వస్తాయి. వారి తుది నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి.

– అష్పాక్ అహ్మద్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

సరిహద్దులో ఏనుగుల సంచారం

- అప్రమత్తమైన జిల్లా అటవీశాఖ



గడ్చిరోలి పట్టణంలో తిరుగుతున్న ఏనుగు

చింతలమానెపల్లి(సిర్పూర్): సరిహద్దుల్లో ఏనుగుల సంచారంతో జిల్లా అటవీశాఖ అప్రమత్తమైంది. గతేడాది ఏప్రిల్‌లో చింతలమానెపల్లి మండలం బూరెపల్లి, పెంచికల్‌పేట్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగు చంపిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన సంచలనంగా మారింది. జిల్లా నుంచి ఏనుగు సరిహద్దు దాటేవరకు అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మహారాష్ట్రలోని మురుంగావ్ అటవీ ప్రాంతంలో సుమారుగా 25కు పైగా ఏనుగులు ఉన్న గుంపు తిరుగుతూ ఉంటుంది. ఈ ఏనుగుల గుంపు నుంచే జిల్లాకు గతేడాది ఏనుగు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేశారు. తాజాగా అదే గుంపునకు చెందిన ఏనుగులు గడ్చిరోలి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించాయి. మూడు నెలల నుంచి గడ్చిరోలి జిల్లా కేంద్రం సమీపంలోని కాటాని, వైన్‌గంగ నదీ తీర ప్రాంతాల్లోని గ్రామాల సమీపంలో తిరుగుతున్నాయి. అటవీ ప్రాంతం నుంచి ఏకంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లోకి రావడంతో అక్కడి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

సమాచారం కోసం సంప్రదింపులు

గడ్చిరోలి నుంచి చాముర్షి వరకు ఉన్న అటవీ ప్రాంతం తెలంగాణ సరిహద్దుకు ఆనుకుని ఉంది. గడ్చిరోలి జిల్లాలోని ఆష్టి సమీపంలోని అటవీ ప్రాంతం చింతలమానెపల్లి మండలానికి ప్రాణహిత నది మాత్రమే హద్దుగా ఉంది. గతేడాది ఇదే ప్రాంతం నుంచి ఏనుగు మన జిల్లాలోకి ప్రవేశించింది. చాముర్షి తాలూకా కేంద్రం సమీపంలోని వ్యాడ్ గ్రామంలో ఒక యువకుడిపై నెల రోజుల క్రితం ఏనుగు దాడి చేయడంతో మృతి చెందాడు. గడ్చిరోలి పట్టణానికి మన సరిహద్దు నుంచి 100 కిలోమీటర్ల రోడ్డుమార్గం ఉండగా.. అటవీ ప్రాంతం గుండా 50 లేదా 60 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు మహారాష్ట్ర అటవీ అధికారులతో సమాచారం తెలుసుకుంటున్నారు. ఏనుగులు సంచరిస్తున్న కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతుండగా.. వాస్తవాలు తెలుసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఖర్జెల్లి ఎఫ్ఆర్‌వో ఇక్బాల్ మాట్లాడుతూ.. సమాచారం కోసం గడ్చిరోలి జిల్లా అటవీ అధికారులతో సంప్రదించామని తెలిపారు. స్థానిక అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏనుగులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు తక్కువని తెలిపారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 8, 10, 12 స్థాయిలో నిర్వహించే ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు రావాలని సూచించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు విద్యాసాగర్ 80080 90626 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో సోమవారం లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ ప్రారంభానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకమైందన్నారు. చట్టంతోపాటు భూమి కొలతల్లో ప్రతీ అంశంపై అవగాహన ఉండాలని సూచించారు. వారసత్వ పాలు పంపకాలు, కొనుగోలు పట్టాల మార్పిడిలో సర్వేయర్లు మోకాపైకి వెళ్లి కొలతలు తీసి నక్ష సమర్పించడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు ఉండవన్నారు. 50 రోజుల పాటు శిక్షకులు నేర్పించే అంశాలపై పట్టుసాధించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా భూమి కొలతల అధికారి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, పక్కన ఎమ్మెల్సీ విఠల్

దహెగాం(సిర్పూర్): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అలీ, ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని ఇట్యాల గ్రామంలో సోమవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ రామారావు, నాయకులు గజ్జెల సురేశ్, బ్రహ్మయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత స్టేషన్.. నయా కిడ్స్‌జోన్



పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, తదితరులు



కిడ్స్ జోన్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి పోలీస్ స్టేషన్ నూతన భవనంలోకి మారిన తర్వాత పాత భవనం సీఐ కార్యాలయంగా కొనసాగిస్తున్నారు. అక్కడ ఖాళీగా ఉన్న గదులు, హాల్ పిల్లలకు ఉపయోపడాలనే ఉద్దేశంతో ఏఎస్పీ చిత్తరంజన్ సరికొత్త ఆలోచన చేశారు. చిన్నారులను ఆకర్షించేలా హాల్‌లో ఆట వస్తువులు, బొమ్మలు, బెలూన్స్ ఏర్పాటు చేసి కిడ్స్ జోన్‌గా రూపొందించారు. చెస్, క్యారమ్, కిక్ బాక్సింగ్ కిట్, బాల్స్ టబ్, జారుడు బల్ల, తదితరాలు అందుబాటులో ఉంచిన ఈ కిడ్స్‌జోన్‌ను సీఐ సత్యనారాయణతో కలిసి ఏఎస్పీ సోమవారం ప్రారంభించారు. ఏఎస్పీ మాట్లాడుతూ పోలీస్ క్వార్టర్లలో నివాసం ఉంటున్న పిల్లలకు ఆటలాడుకునేందుకు సరైన వసతులు లేకపోవడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పాత పోలీస్‌స్టేషన్ భవనంలో కిడ్స్ జోన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 15 మంది చిన్నారులకు ఉపయోగపడేలా ఆట వస్తువులు అందుబాటులో ఉంచామన్నారు. పిల్లలు ఒకే చోట ఆడుకోవడం, వస్తువులు ఇచ్చిపుచ్చుకోవడం వల్ల వారిలో స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. తిర్యాణి మండలంలోని పాత పోలీస్ స్టేషన్ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి విద్యార్థులు వినియోగించుకునేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రశాంత్, మధుకర్, ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

- ప్రజావాణిలో గోడు వెల్లబోసుకున్న అర్జీదారులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువలా వచ్చాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చి అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్నంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద మురుగు కాలువను ఆక్రమించడంతో మురుగు నీరంతా ఇంట్లోకి చేరుతుందని, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ పట్టణం ఇర్ఫాన్‌నగర్‌కు చెందిన పర్రె శ్రీకాంత్ కోరాడు. తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించారని, న్యాయం చేయాలని కౌటాల మండలం కనికి గ్రామానికి చెందిన మడే లక్ష్మయ్య దరఖాస్తు చేసుకున్నాడు. ఆసిఫాబాద్ మండలం బోర్‌పల్లి గ్రామ శివారులోని భూమిని ఆక్రమించారని మిట్ట మల్లన్న ఫిర్యాదు చేశాడు. సింగరేణి ఉపరితల గనిలో తిర్యాణి మండలం దేవాయిగూడ గ్రామంలోని ఇళ్లను కోల్పోయామని నష్టపరిహారం ఇచ్చి ఉపాధి చూపాలని రెబ్బెన మండలం గోలేటిలోని గౌతమ్‌నగర్‌కు చెందిన బోయిని సురేందర్ దరఖాస్తు చేసుకున్నాడు. పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన రూ.లక్ష ఇప్పించాలని కాగజ్‌నగర్ పట్టణంలోని నజ్రూల్‌నగర్‌కు చెందిన కవిత మండల్ అర్జీ సమర్పించింది. తమ గ్రామానికి తాగునీటిని అందించాలని సిర్పూర్(యూ) మండలం రాఘవాపూర్ పంచాయతీ పరిధిలోని మారుగూడ గ్రామస్తులు కోరారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తొలగించాలని వాంకిడి మండల కేంద్రంలోని కేబీ నగర్ కాలనీవాసులు విన్నవించారు. తన కుమార్తె పిడుగుపాటుతో మరణించిందని, ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని బెజ్జూర్ మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య కోరాడు.

ఆలయ స్థలానికి హద్దులు నిర్ణయించాలి

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు ఆలయ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆలయానికి తూర్పు వైపు నుంచి వెళ్తున్న రహదారికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్నా వివేక్, డాక్టర్ మధు, రాధాకృష్ణచారి, కృపాల్, ప్రకాశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

లోన్ ఇప్పించండి



గతంలో నేను నక్సల్స్‌లో పనిచేసి 2004లో ప్రభుత్వానికి లొంగిపోయా. ప్రస్తుతం కూలీ పని చేసుకుంటున్నా. ప్రభుత్వం బ్యాంకు ద్వారా లోన్ మంజూరు చేయిస్తే కిరాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటా. ఉపాధి లేకపోవడంతో ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా కలెక్టర్ స్పందించి బ్యాంక్ ద్వారా లోన్ ఇప్పించాలి.

– బోయిని నగేశ్, ఆసిఫాబాద్

పేరు మార్చాలి



రెబ్బెన మండలం తుంగెడ శివారులో సర్వే నం.152/1లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. పట్టా పాసు పుస్తకంలో భీమయ్యకు బదులుగా సుక్కుబాయి పేరు ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నా. మండల స్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి పేరు మార్చాలి.

– భీమయ్య, పోతపల్లి, మం.రెబ్బెన

పాసు పుస్తకం ఇప్పించాలి



రెబ్బెన మండలం తక్కలపల్లి శివారులోని సర్వే నం. 132లో తొమ్మిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి కొత్త పట్టా పాసుపుస్తకం ఇప్పించాలి. ప్రస్తుతం ప్రభుత్వం రైతుబంధు, ఇతర సంక్షేమ ఫలాలు అందడం లేదు.

– బంక పోచయ్య, తక్కలపల్లి, మం.రెబ్బెన

పోడు సాగు అడ్డుకోవడం అన్యాయం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్ గ్రామ శివారులో సోమవారం అటవీశాఖ అధికారులు పోడు భూములను దున్ని చెట్లు నాటే కార్యక్రమం మొదలు పెడుతున్నారనే విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోడు రైతులతో మాట్లాడారు. కొత్తగా అటవీ భూమిని ఆక్రమించవద్దని పేర్కొన్నారు. పోడు రైతులను ఇబ్బంది పెట్టి వారి జీవనోపాధికి అంతరాయం కలిగించవద్దని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. రెండు రోజుల క్రితం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ సంవత్సరం ఫారెస్ట్ ల్యాండ్ రిట్రీవల్ పేరిట పోడు భూముల్లో మొక్కలు నాటేది లేదని ఫారెస్ట్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దానికి అనుగుణంగా అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని పోడు రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, అండగా నిలిచి పంటల సాగుకు సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో ఓ వితంతువుపై లైంగిక వేధింపులకు పాల్పడిన గడ్డి భీరయ్యపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల 23న రాత్రి మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడి చేయిపట్టి లాగి కోరిక తీర్చమంటూ లేదంటే చంపుతానని బెదిరించాడు. ఆమె కేకలు వేస్తూ తప్పించుకొని పారిపోయింది. సోమవారం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన పావడే లక్ష్మణ్(32) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహ్మద్ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. మృతుడు లక్ష్మణ్ స్థానికంగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసగా మారగా, పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం ఉదయం సైతం ఇంటికి వచ్చి గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమివ్వగా, వారు చేరుకుని మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. భార్య స్వప్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆలోతు లక్ష్మిప్రియ, ఆమె కుటుంబ సభ్యులపై కొందరు స్థానికులతోపాటు వేరే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని సోమవారం ఆమె ఇంట్లో చొరబడి ఆమెతోపాటు కుటుంబ సభ్యులపై దాడి చేయడమే ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈవిషయమై చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ రిపేర్ చేయలేదని షోరూంకి తాళం

నిర్మల్‌టౌన్: బైక్ రిపేర్ చేయలేదని కస్టమర్ ఓ షోరూంకు తాళం వేశాడు. జిల్లా కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మామడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన సాయన్న 10 నెలల క్రితం నిర్మల్‌లో ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. అది రిపేర్ నిమిత్తం షోరూంకు శనివారం తీసుకువచ్చాడు. మూడు రోజులైనా రిపేర్ చేయకపోవడంతో ఆగ్రహించి సోమవారం సాయంత్రం షోరూంకు తాళం వేశాడు. ఈ విషయమై నిర్వాహకులు మాట్లాడుతూ స్థానికంగా సర్వీస్ సెంటర్ లేదన్నారు. మెకానిక్ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. సాయన్న బైక్‌కు కావాల్సిన మెటీరియల్ హైదరాబాద్ నుంచి రావాలని, అందుకే ఆలస్యమవుతోందన్నారు. తాళం వేయడంపై పోలీసులను ఆశ్రయిస్తామన్నారు.

పిడుగుపాటుకు స్పృహ తప్పిన ఇద్దరు చిన్నారులు

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లిలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతోపాటు పిడుగుపాటుకు ఇద్దరు చిన్నారులు స్పృహ తప్పారు. మహారాష్ట్రకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన చిన్నారులు ఆకాశ్, జ్యోతి స్పృహతప్పి పడిపోగా కుటుంబీకులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పంటమార్పిడితోనే ఫలితం

- ఏళ్ల తరబడి ఒకే రకం పంటలు చేటు
- మార్పుతోనే మంచి దిగుబడి


దుక్కి దున్నుతున్న రైతు


రాజశేఖర్, శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఖరీఫ్‌సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. రుతుపవనాలు జూన్ మొదటి వారంలో జిల్లాలను తాకానున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు పడేలోగా విత్తనాలు సమకుర్చుకునే పనిలో రైతులు సమయాత్తమవుతున్నారు. అయితే వారు గుర్తించుకోవాల్సిన ముఖ్య విషయమేమిటంటే.. ఒకే భూమిలో ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి పండిస్తూ దిగుబడి రాక అనేక సమస్యలు ఎదురువుతున్నాయి. చీడపీడల బెడద అధికమవడంతోపాటు భూమి నిస్సారమవుతుంది. పంట మార్పిడితో ప్రయోజనం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ సస్యరక్షణ శాస్త్రవేత్త రాజశేఖర్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి నేలలు 70 శాతం, 20 శాతం ఎర్ర,10 శాతం చౌడు ఇసుక నేలలు ఉన్నాయి. అన్ని పంటలకు అనుకూలంగా నేలలు ఉన్న రైతులు పత్తి, సోయా, వరి పంటలను ఎనిమిదేళ్లుగా సాగు చేస్తున్నారు. దీని ద్వారా చీడపీడల ఉధృతి పెరుగుతుంది. భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారు. పంట మార్పిడితో కొంతవరకు దిగుబడి పెంచుకుని నష్టాల నుంచి గట్టెక్కే ప్రయోజనం ఉంది.

పంట మార్పునకు..

పంట మార్పిడి చేయాలంటే అంతకుముందు వేసిన పంటకు భిన్నంగా ఎంచుకోవాలి. ఉదాహరణకు కొన్ని పంటలు వేరు వ్యవస్థలు భూమి నుంచి పోషకాలను గ్రహిస్తాయి. నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు ఈ కోవలోకి వస్తాయి. అపరాల పంటలు కొంతవరకు పరిస్థితుల్ని కూడా తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాల్ని అందిస్తాయి. ఈ పంట వేరు బుడిపెలు నత్రజనిని స్థిరీకర్తిస్తాయి. నల్లరేగడి నేలల్లో నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు పండించిన వారు సోయచిక్కుడు వేసుకుంటే మంచిది. ఈ పంట సమయానికి ఆకులు పూర్తిగా రాలిపోతాయి. తద్వారా ఎకరాకు 1 నుంచి 2 టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

ఎలాంటి పంట వేసుకోవాలి

గతేడాది రబీలో వేరుశనగ వేసిన రైతులు ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న వేసుకుంటే పంటకు నత్రజని లభిస్తుంది. ఫలితంగా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించుకోవచ్చు. దీనివల్ల రాబోయే రబీలో మళ్లీ వేరుశనగ వేసినప్పుడు ఆ పంట నులిపురుగుల బెడద తగ్గుతుంది. శనగ పంట వరుసగా వేసుకుంటే కాయతొలుచు పురుగుల తాకిడి ఉంటుంది. వీటి దాడి తక్కువగా ఉండే జొన్న, నువ్వులు, ఉలవ, మెట్ట వరి పంటలు వేసుకోవచ్చు. కంది, శనగ, పంటలతో పోలిస్తే మినుము, సోయచిక్కుడు పంటలకు కాయతొలుచు పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. వీటితో పంట మార్పిడి చేయవచ్చు. వరుసగా పొద్దుతిరుగుడు వేసుకున్నవారు దాని స్థానంలో కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యపు పంటలు వేసుకోవాలి. దీనివల్ల నులిపురుగు తాకిడి తగ్గుతుంది. అనుప, కాకర, దోస, కర్బూజ, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ తీగజాతి కూరగాయల పంటల సాగు చేసినవారు వరితో పంట మార్పిడి చేసుకోవాలి.

ఏళ్లుగా పసుపు వేయొద్దు

ఒకసారి పసుపు వేసిన భూమిలో రెండేళ్లపాటు పసుపు సాగు చేయొద్దు. వరుసగా పసుపు వేసుకుంటే దిగుబడి తగ్గిపోతాయి. చీడపీడల దాడి అధికమవుతుంది. పసుపు వేసిన భూమిలో వరి, చెరుకు, అరటి పంటలు వేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.

చీడపీడల నివారణకు..

కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు, కొన్ని పంటల్ని అధికంగా ఆశించి వృద్ధి చెందుతాయి. అలాంటి పంటల్ని వరుసగా వేసుకోకుండా పంట మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు ఒకే భూమిలో వరుసగా వరి వేయకుండా పప్పు ధాన్యపు పంటలు, నూనె గింజల పంటలు వేసుకోవాలి. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటల్ని లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు, అరుతడి పంటలతో పంట మార్పిడి చేయాలి. దీనివల్ల ఆయా పంటల్లో కాళహస్తి తెగులు, నులి పురుగులు, ఆకుముడత, లద్దె పురుగుల ఉధృతిని నివారించవచ్చు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు

- జిల్లాకు 15 మెడల్స్
- జాతీయస్థాయికి ఇద్దరు ఎంపిక


మెడల్స్‌తో మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టైసన్ బాక్సింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. 260 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఆద్యంతం ఆకట్టుకునేలా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో అలరించారు. జిల్లా కేంద్రంలో కోచ్ రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం నుంచి 19 మంది పోటీల్లో పాల్గొనగా 9 గోల్డ్, 2 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 15 మెడల్స్‌ను సాధించారు. గోల్డ్ మెడల్‌ను సాధించిన వారిలో ఏ.రక్షిత్, జి.రిశ్వంత్, ఎండీ ఉబేద్, క్రితి అగర్వాల్, బి.రుత్విక్ కుమార్, ఓ.సంస్కృతి, సీహెచ్.హాసిని, బి.అనుదీప్, ఎస్.షణ్ముఖ్ తేజ ఉన్నారు. సిల్వర్ మెడల్ సాధించిన వారిలో పి.కార్తీక్, జి.శ్రీనాథ్, బ్రాంజ్ మెడల్ సాధించిన వారిలో ఎం. అశ్వత్, పురబ్ బిశ్వాస్, బి.అనురాగ్, సీహెచ్.జగదీశ్వర్ ఉన్నారు. వీరిని జిల్లా యువజనుల క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు అభినందించారు. జాతీయ స్థాయిలో వచ్చే నెల 3న గోవాలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు క్రితి అగర్వాల్, ఉబేద్ ఎంపికైనట్లు కోచ్ రాజేశ్ తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం

నిర్మల్‌టౌన్: గల్ఫ్ ఏజెంట్ డబ్బులు తీసుకుని తనకు దుబాయ్ పంపించి చెప్పిన పనికాకుండా వేరే పని ఇప్పించి మోసం చేశాడని బాధితుడు వాపోయాడు. వివరాల్లోకి వెళ్తే..జిల్లాకేంద్రంలోని కూరన్నపేట్‌లో నివాసం ఉంటున్న శివశంకర్ భార్య యశోద ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. హాస్పిటల్‌కి గోవర్ధన్ చికిత్స కోసం వచ్చేవాడు. అలా శివశంకర్ భార్యతో పరిచయం పెంచుకున్నాడు. నీ భర్తను దుబాయ్ పంపిస్తానని, అధిక డబ్బులు సంపాదించుకోవచ్చని ఆమెను నమ్మించాడు. దీంతో వారు దుబాయ్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగానికి రూ.63 వేలు ఏజెంట్‌కు ఇచ్చి ఒప్పంద పత్రం స్థానిక ఓ ట్రావెల్స్‌లో రాయించుకున్నారు. అనంతరం దుబాయ్ వెళ్లిన శివశంకర్‌ను ఇబ్బంది పెట్టారు. దీంతో ఇంట్లో వాళ్లకి ఫోన్‌చేసి జరిగింది చెప్పాడు. ఏజెంట్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. భార్య వేరే వ్యక్తుల వద్ద అప్పుచేసి రూ.లక్ష వడ్డీకి తీసుకువచ్చి దుబాయ్‌కి పంపడంతో ఆయన అక్కడి నుంచి వచ్చాడు. ఇలా తప్పుడు పత్రాలతో మోసగించిన ఏజెంట్ గోవర్ధన్‌పై చర్యలు తీసుకుని మా డబ్బులు ఇప్పించాలని స్టేట్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలో ఎస్పీ జానకీ షర్మిలకు వినతిపత్రం అందజేశారు.

ఇంట్లో గొడవపడి వెళ్లిన మహిళ అప్పగింత

ఖానాపూర్: ఇంట్లో గొడవపడి వెళ్లిన మహిళను కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో వెడ్మ అనసూయ సోమవారం ఇంట్లో గొడవపడి వెళ్లిపోయిందని భర్త బారు, కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో నిర్మల్ ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో లోకేషన్ ఆధారంగా కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో మహిళను గుర్తించామన్నారు. ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి మహిళను అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

అక్రమ పత్రాలతో మోసం చేసిన ఉద్యోగి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి మోసం చేసిన కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ సునీల్ కుమార్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన కొండూరి గంగాధర్ విద్యానగర్‌కు చెందిన సయ్యద్ రజాక్ సర్వే నం.346, ప్లాట్ నం.191 అటెండర్ కాలనీలో ప్లాట్ విక్రయించాడు. పదవిని దుర్వినియోగం చేసి సుమిత్రబాయి అనే అటెండర్ పేరుపై నకిలీ దస్తావేజులు తయారు చేసి బాధితుడికి విక్రయించాడు. సయ్యద్ రజాక్ ఈ ప్లాట్‌ను బ్రహ్మకంటి సత్యనారాయణకు విక్రయించగా, ఆయన నళినికి ప్లాట్‌ను అమ్మాడు. ఆమె బ్యాంక్ రుణం తీసుకుని ఇల్లు నిర్మించే క్రమంలో అక్కడికి వెళ్లి స్థల యజమాని తోట ఆశమ్మ అభ్యంతరం తెలిపింది. దీంతో మోసం వెలుగులోకి వచ్చింది. మొదట ప్లాట్ కొనుగోలు చేసిన సయ్యద్ రజాక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు. కొండూరి గంగాధర్ అక్రమంగా సుమిత్రబాయి సహకారంతో, ఆమెను బెదిరించి అక్రమ పత్రాలు సృష్టించినట్లు తేలిందని సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంగాధర్ ప్రస్తుతం జెడ్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల ఈ వ్యవహారానికి సంబంధించి బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారిస్తూ కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దాని ఆధారంగా గంగాధర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీచేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను పీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 119 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఆయా అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదరస్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామానికి బోర్‌వెల్ సౌకర్యం కల్పించాలని గిత్తే మనోహర్ దరఖాస్తు అందించాడు.
- తలమడుగు మండలం రేకులగూడ గ్రామానికి రోడ్లతోపాటు ఇళ్ల సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విన్నవించారు.
- ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నాడు.
- కడెం మండలం ఉడుంపూర్ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరాడు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి


రాహుల్(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. కడెం మండలం లింగాపూర్‌కు చెందిన నీరేటి రాహుల్ (19) ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్‌కు బైక్‌పై పండుగ నిమిత్తం వెళ్లి తిరిగివస్తున్నాడు. ఖానాపూర్ మండలం గోసంపల్లె పొలిమేరలో చెట్టును ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడు జక్కుల కార్తీక్‌కు సురక్షితంగా బయటపడ్డాడు. యువకుడి అతి వేగం, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం చోటు చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


విష్ణుతేజ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన గొత్రె విష్ణుతేజ(12) విద్యార్థి చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విష్ణుతేజ 7వ తరగతి చదువుతున్నాడు. సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గొడవ పెట్టుకుని నెలరోజుల క్రితం పురుగుల మందు తాగాడు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తెలిపారు.

మేకల మందపై చిరుత దాడి


గాయపడ్డ మేక

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ అనుబంధ దర్యాపూర్ గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో మేకల మందపై సోమవారం సాయంత్రం చిరుత పులి దాడి చేసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎరుకల శ్రీకాంత్ మేకలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. మేకలు మేస్తుండగా చిరుత ఒక్కసారిగా మందపై దాడిచేసింది. ఈ ఘటనలో ఓ మేక మేక గాయపడింది. ఈమేకు బాధితుడు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నందున పశువులు, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీఅధికారులు సూచించారు.

స్మార్ట్ బజార్

- నెట్టింట్లో ఆర్డర్.. నట్టింటికే సరుకులు
- మార్కెటింగ్ రంగంలో ఆధునిక విప్లవం..
- విస్తరిస్తున్న ఆన్‌లైన్ మార్కెట్..
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న ఈ-కామర్స్
- నేడు ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవం



నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుత మార్కెటింగ్ రంగం రోజు రోజుకూ కొత్త ఒరవడిని సంతరించుకుంటూ వినియోగదారులను ఆకర్షిస్తోంది. గతంలో షాపింగ్ కోసం మార్కెట్‌కు వెళ్లి వస్తువులు కొనుగోలు చేసే సంప్రదాయం ఉండేది. కానీ, నేడు ఈ-కామర్స్ సంస్థలు ఇంటి నుంచి అడుగు బయటపెట్టకుండానే నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాల వరకు అన్నింటినీ ఇంటికి చేర్చే సౌలభ్యాన్ని అందిస్తున్నాయి. మంగళవారం ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవం సందర్భంగా ఈ-కామర్స్ సంస్కృతిపై ప్రత్యేక కథనం.

ఆన్‌లైన్ షాపింగ్ జోరు

గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ కొనుగోళ్లు ఇప్పుడు గ్రామాలు, మారుమూల తండాలకు విస్తరించాయి. నిత్యావసరాలు, బట్టలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పాదరక్షలు అన్నీ మొబైల్ ద్వారా ఆర్డర్ చేసి ఇంటికి తెప్పించుకుంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సౌలభ్యాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ- కామర్స్ సంస్థల విస్తృత నెట్‌వర్క్, సులభమైన డెలివరీ వ్యవస్థ ఈ ట్రెండ్‌ను వేగవంతం చేసింది.

ఉపాధి అవకాశాలు

ఉమ్మడి జిల్లాలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో వంటి సంస్థలు ఏజెన్సీలు, కొరియర్ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. స్థానిక యువత డెలివరీ సిబ్బందిగా ఉపాధి పొందుతూ వినియోగదారులకు నేరుగా వస్తువులను అందజేస్తున్నారు. ఈ వ్యవస్థ గ్రామీణప్రాంతాలకు కూడా సేవలను అందిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. 'స్మార్ట్ నిర్మల్'యాప్ ద్వారా నచ్చిన రెస్టారెంట్ నుంచి ఫుడ్‌ను జిల్లావాసులు ఆర్డర్ చేసి తెప్పించుకుంటున్నారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల సమన్వయంతో శాఖాహార, మాంసాహార ఐటమ్స్‌ను సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే డెలివరీ చేస్తున్నారు. కాగా, ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుతో స్థానిక వ్యాపారులకు కొంత నష్టం జరుగుతుందని, వారిని ప్రోత్సహించాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

యువత ఆధిపత్యం

మొబైల్ ఫోన్‌ను విరివిగా వినియోగించే యువత ఈ-కామర్స్ సేవలను ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఫ్యాషన్ వస్తువులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల నుంచి ఆహార పదార్థాల వరకు వారు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. గృహిణులు కూడా నిత్యావసరాలు, బట్టలు, గృహ సామాగ్రి కొనుగోలుకు ఈ-కామర్స్ వేదికలను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లలో తప్పుడు వెబ్‌సైట్‌లు, మోసపూరిత లావాదేవీల నుంచి జాగ్రత్తగా ఉండాలి. విశ్వసనీయ సంస్థలను ఎంచుకోవడం, ముందస్తు చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. పిన్‌కోడ్, చిరునామా, మొబైల్ నంబర్ వంటి వివరాలను సురక్షిత వెబ్‌సైట్లలోనే నమోదు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

బయటకు వెళ్లలేకనే..



బయటకు వెళ్లి షాపింగ్ చేసే సమయం లేదు. ఇంట్లో ఉండి నిత్యావసరాలు తదితర వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తుంటాను. డెలివరీ తర్వాత వస్తువు డ్యామేజ్ ఉన్నా రిటర్న్ చేసే అవకాశం ఉంది. కాలానికనుగుణంగా ఈ కామర్స్ షాపింగ్ మంచి వేదికగా మారుతోంది. – లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభుత్వ ఉద్యోగి, నిర్మల్

స్థానిక మార్కెట్‌పై ప్రభావం



అరచేతిలో సెల్‌ఫోన్ ఉండడంతో ఆన్‌లైన్ షాపింగ్‌కు ఆసక్తి పెరుగుతోంది. ఈ కామర్స్ వ్యాపారం క్రమంగా పల్లెలకు విస్తరించడంతో స్థానిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నిర్మల్ మార్కెట్ ప్రస్తుతం పండుగ సీజన్లో వెలవెలబోతోంది. స్థానిక వ్యాపారులకు వర్తకం జరిగేలా ప్రోత్సహించాలి. – పోల దయాకర్, వస్త్ర వ్యాపారి, నిర్మల్

కుమార్తెను వేధించిన తండ్రిపై పోక్సో కేసు

మంచిర్యాలక్రైం: కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని హమాలివాడకు చెందిన గౌతమ్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, మైనర్ కుమార్తె ఉంది. ప్రతిరోజూ కుమార్తెను లైంగికంగా వేధించేవాడు. భార్య పేరిట ఉన్న ఇల్లు తన పేరిట చేయాలని ఆమెతో గొడవపడేవాడు. ఈవిషయంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా పద్ధతి మార్చుకోలేదు. బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం గౌతమ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామగుండం సీపీ పేరిట ఫేక్ అకౌంట్

మంచిర్యాలక్రైం: రామగుండం సీపీ పేరిట ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల ఫొటో, పేర్లతో ఫేక్ ఫేస్‌బుక్, వాట్సాప్ క్రియేట్ చేసి అందరికీ ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి డబ్బులు అడగడం, ట్రాన్స్‌ఫర్లు కావడం, పుట్టిన రోజు సందర్భంగా బహుమతులు పంపించేలా సైబర్ నేరగాళ్లు చాట్ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అధికారే చాటింగ్ చేస్తున్నారని నమ్మి మోసపోవద్దని, ఎవరూ డబ్బులు పంపవద్దని తెలిపారు. పోలీస్ అధికారులు ఎవరూ చాటింగ్, ఫ్రెండ్స్ రిక్వెస్ట్ చేయరని, ఫేక్ అకౌంట్లపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

అటవీ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి


చామనపల్లి ఎస్సీ, ఎస్టీ రైతులు, బీజేపీ నాయకులు

- పోలీసులను ఆదేశించిన మంచిర్యాల కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్:వేమనపల్లి మండలం చామనపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులపై అక్రమ కేసులు పెట్టిన అటవీ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. బాధితులు ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌ను కలిసి అటవీ అధికారులు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 65, 67లోని భూములు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం 1997లో సర్వే చేసి ఫైనల్ పట్టా జారీ చేసిందని, తెలంగాణ ప్రభుత్వం కొత్త పట్టా పాసుపుస్తకాలు జారీ చేసిందని వివరించారు. ఈ భూముల్లో బోరుబావులు తవ్వుకోవడం, విద్యుత్‌లైన్ కూడా వచ్చిందని మోటర్లు కూడా బిగించుకోవడం జరిగిందని తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఈ భూముల్లో సాగు చేయద్దని 9 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు, అటవీ అధికారులకు విన్నవించామన్నారు. అయినా అటవీశాఖ అధికారులు దాడులు ఆగడం లేదని వాపోయారు. పట్టాపాస్ పుస్తకాలు చేతపట్టుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. స్పందించి కలెక్టర్ పోలీసు అధికారులకు ఫోన్ చేసి అటవీ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

నకిలీ పత్రాలు సృష్టించిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: భూ దస్తావేజుల మోసం, నకిలీపత్రాలు సృష్టించిన పాత హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి సజ్జనపు లక్ష్మీనారాయణను అరెస్టు చేసినట్లు మావల సీఐ స్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్వే నం.54/1లోని ప్లాట్ నం.20ను ఎల్ఐసీ ఉద్యోగి మల్లెపూల చంద్రశేఖర్‌గౌడ్ కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఆ ప్లాట్ వాస్తవానికి లేదని, నిందితుడు వేరే డాక్యుమెంట్ నంబర్ ద్వారా విక్రయించాడు. అంతకుముందు నిందితుడు మరోసారి సర్వే నం.54లోని ప్లాట్ నం.85ను బాధితుడి పేరిట రిజిస్టర్ చేశాడు. ఇది కూడా మంథ గోపాలకృష్ణకు అమ్మినట్లు తేలింది. డాక్యుమెంట్లను పరిశీలించగా నిందితుడు ఉద్దేశపూర్వకంగా మోసం చేశాడని, నకిలీ పత్రాల తయారీ, నకిలీ పత్రాలను అసలైనవిగా ఉపయోగించినట్లు నిర్ధారణ అయింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం సాయంత్రం శివాజీ చౌక్ వద్ద నిందితుడిని అదుపులో తీసుకున్నారు. జడ్జి ఎదుట హాజరుపర్చగా, 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధిం